క్లుప్తంగా

ఆలయాలకు శంకుస్థాపన



దేవరపల్లిలో రామాలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని పలు ఆలయాలకు శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శంకుస్థాపనలు చేశారు. దేవరపల్లి చిన మెరకలో నూతనంగా నిర్మించనున్న కోదండ రామాలయానికి , అలాగే రావులపాడులో భక్తాంజనేయస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునః నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.

చదరంగం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

ఆలమూరు: స్థానిక ఓ ప్రైవేట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు చదరంగం పోటీల్లో చక్కని ప్రతిభను కనబర్చి అవార్డులు సాధించారు. మండపేట టౌన్‌హాల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ది వైశ్యా యూత్ చదరంగం పోటీలను నిర్వహించింది. అండర్–9 విభాగంలో పీఎస్ కార్తీక్, అండర్–9 విభాగంలో జి.దేవీఅక్షయ, అండర్–11 విభాగంలో జి.ఆశ్రయ అవార్డులు సాధించారు. కరస్పాండెంట్ కె.ముల్లారావు ఆ విద్యార్థులను అభినందించారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలను ప్రోత్సహించాలి



పీహెచ్‌సీ సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ వనజకుమారి, జెడ్పీటీసీ ఆంజనేయులు

మామిడికుదురు: ప్రజలకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఇక్కడ అందుతున్న సేవలపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ కొరిరెడ్డి ఆంజనేయులు సూచించారు. నగరం పీహెచ్‌సీ సలహా కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఎంపీపీ వనజకుమారి, జెడ్పీటీసీ ఆంజనేయులు మాట్లాడుతూ పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉందన్నారు. వీటి సంఖ్య పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్న అపవాదు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో చేపట్టిన నాడు–నేడుపై ఏ విధమైన స్పష్టత లేదని దీనిపై ఉన్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. సమావేశంలో వైద్యులు కేజే ప్రశాంత్, కె.స్వర్ణలత, సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, పీహెచ్‌సీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే దుష్ప్రచారం

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో పి.గన్నవరం నియోజకవర్గంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఊడిమూడి వంతెన, అప్పనపల్లి కాజ్‌వే ఆధునీకరణ, అయినవిల్లి తొగరపాయ వంతెన, మామిడికుదురు మండలాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లకు ఆమోదం, పి.గన్నవరంలో ఫైర్‌స్టేషన్‌కు ఆమోదం లభించాయన్నారు. వీటితో పాటు రూ.కోట్ల వ్యయంతో నియోజకవర్గంలోని పలు ఆర్‌అండ్‌బీ రోడ్లను పక్కాగా ఆధునీకరిస్తున్నామన్నారు. ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నా ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం భావ్యం కాదన్నారు. సమావేశంలో అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్య కుమార్, యాళ్లవీ సత్యనారాయణ, నూర్ బాషా కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మస్తాన్ సాహెబ్ పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో యానం సబ్‌కలెక్టర్



అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని యానం సబ్ కలెక్టర్ మునిస్వామి శనివారం దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మునిస్వామిని వేదమంత్రాలతో సత్కరించి స్వామి శేషవస్త్రాన్ని, చిత్రపటాన్ని బహూకరించారు. స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పొగమంచుతో రైతు గుండెల్లో దడ

- తెల్లవారుజామున 19 డిగ్రీల సెల్సియస్
- తెగుళ్ల ఉధృతి పెరుగుతుందని ఆందోళన

అంబాజీపేట: పొగమంచు దట్టంగా ఆవరిస్తోంది. శీతాకాలం ప్రవేశించిన తర్వాత రెండ్రోజులుగా అత్యధికంగా మంచు కురుస్తోంది. తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో 19 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు పడిపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో దట్టంగా పొగమంచు ఆవరిస్తోంది. దీంతో వరి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 18,682 ఎకరాలు, రాజోలు నియోజకవర్గంలో 1,106 ఎకరాలు, కొత్తపేట నియోజకవర్గంలో 27,114 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకూ మూడు నియోజకవర్గాల్లో 90 శాతం నాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం వరి వివిధ దశల్లో ఉంది. మంచు వల్ల వరి ఎదుగుదల కోల్పోవడం, మొవ్వ తెగులు ఆశించడంతో పాటు పిలకలు వేసే అవకాశం లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మంచు అధికంగా కురవడం వల్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా శీతాకాలంలో 22 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు పడిపోతాయి. ఈ ఏడాది 19 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడంతో మంచు విపరీతంగా కురుస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు ఈ విధంగా పడిపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాంతో వరిపంటను కాపాడుకునేందుకు రైతులు విచ్చలవిడిగా ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. విచక్షణారహితంగా ఎరువులు వినియోగించడం వల్ల పంట నష్టం జరుగుతుండంతో పాటు మిత్ర పురుగులను నష్టపోయే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయ సాగు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వం అవగాహన కల్పిస్తుంది. అందుకు గాను వ్యవసాయాధికారులు రైతులకు అర్థమయ్యే రీతిలో క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.



గంగలకుర్రులో వరిచేలో కురుస్తున్న మంచు

ఎదుగుదల తగ్గుతుంది



మంచు కురుస్తుండటంతో వరిలో వివిధ తెగుళ్ల వల్ల మొవ్వ చనిపోతుంది. దీనిని అరికట్టేందుకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు, లేదా క్లోరాపైడాపాస్ 20 ఈసీ రెండు మిల్లీలీటరు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. జింకు లోపం నివారణకు జింకు ఈడీటీఏ 12 శాతం మందును 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

– సీహెచ్‌డీ విజయ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, అంబాజీపేట

దిగుబడులు తగ్గే అవకాశం ఉంది



మంచు అధికంగా కురవడం వల్ల వరి పంట తెగుళ్ల బారిన పడుతుంది. మొవ్వ తెగులుతో పాటు కాండం తొలిచే పురుగు కనిపిస్తుంది. మంచు ప్రభావం వల్ల దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. ఎరువులు, మందులు పిచికారీ చేయడం వల్ల పంట వ్యయం పెరగడంతో పాటు పంటకు నష్టం వాటిల్లుతుంది. వ్యవసాయ అధికారుల సూచన మేరకు పురుగుమందులు పిచికారీ చేస్తాం.

– కొప్పిశెట్టి రాంబాబు, రైతు, గంగలకుర్రు

సేవా సంస్థల భాగస్వామ్యంతో మరిన్ని సౌకర్యాలు

కొత్తపేట: విద్యాలయాల అభివృద్ధికి ప్రభుత్వ చర్యలతో పాటు సేవా సంస్థలు, దాతలు ముందుకు వచ్చి భాగస్వామ్యం కావడం ద్వారా మరిన్ని సౌకర్యాల కల్పనకు అవకాశం ఏర్పడుతుందని ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి అన్నారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గుంటూరుకు చెందిన లూయిస్ వర్గోస్ శాంచెజ్ జ్ఞాపకార్థం కేండిలేరియో సేంచెజ్ శాంటియాగో మేత్రా సంఘం ఆధ్వర్యంలో రూ.2.5 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను సమకూర్చారు. ఈ వాటర్ ప్లాంట్‌ను శనివారం ఎంపీపీ మార్గన గంగాధరరావు ప్రారంభించారు. సభకు ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు అధ్యక్షత వహించగా ఎంపీపీ మార్గన, జెడ్పీటీసీ రమాదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. హోలీ ఫ్యామిలీ ఆఫ్ నజరత్ సంస్థ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం, దాతలు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు ఉద్బోధించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఎంపీటీసీ చావలి సుబ్బరాయశాస్త్రి, గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ కె.జోసఫ్, మండపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాసరావు, స్థానిక కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్, సీనియర్ అధ్యాపకుడు ఎస్.నాగేశ్వరరావు, సంస్థ సభ్యులు ఎస్.శౌరి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అంబాజీపేట: మండలంలోని పుల్లేటికుర్రు హైస్కూలు, శేషశయన సాయి విద్యావనం పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఈ నెల 19న ఊబలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పుల్లేటికుర్రు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు వర్రే జస్వంత్ నాగేశ్వర్, గంటి బాలాశ్రీ సూర్యతేజ, గుత్తుల అభిరామ్, గొర్రెల నాగేంద్ర శ్రీహరి, విద్యార్థినులు గొర్రెల పావని, దొమ్మేటి హాసిని, రాపాక మేరీలు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి అండర్ –17 షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎఎల్ వరప్రసాద్, పీడీ అందే సూర్యనారాయణ తెలిపారు. అలాగే పుల్లేటికుర్రు శేషశయన సాయి విద్యావనం పాఠశాలకు చెందిన 5 గురు విద్యార్థులు కూడా రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కేవీ శశిధర్ తెలిపారు.



రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన పుల్లేటికుర్రు విద్యార్థులు

అండర్–17 విభాగంలో అయ్యగారి భరద్వాజ్, కె.నాగమృదుల వర్షిణి, వి.ప్రవీణ్, వి.పవిత్ర శ్రీజ, ఆర్.జయశ్రీలు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు నేడు, రేపు బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ జల్లి బాలరాజు తదితరులు అభినందించారు.

పిచ్చుకలంకను టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తాం



పిచ్చుకలంక వద్ద పర్యటించిన ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, కలెక్టర్ హిమాన్షుశుక్లా

ఆత్రేయపురం: ఉభయగోదావరి జిల్లాలను కలిపే కాటన్ బ్యారేజీకి మధ్యలో సుందర పర్యాటక ప్రాంతం పిచ్చుకలంక. దీనిని ఇటీవల ప్రభుత్వం టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, కలెక్టర్ హిమాన్షుశుక్లా, జేసీ ధ్యానచంద్ర, ఆర్డీవో ముక్కంటి, టూరిజం అధికారులు పిచ్చుకలంక ప్రదేశాన్ని సందర్శించారు. కాగా ఇటీవల ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పిచ్చుకలంక ప్రాంతాన్ని ఆకస్మికంగా సందర్శించి నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ పిచ్చుకలంక టూరిస్టు అభివృద్ధి కేంద్రానికి కాటన్ బ్యారేజీ రక్షిత ప్రాంతం నుంచి సుమారు 43 ఎకరాలు టూరిజం శాఖకు అధీనంలో ఉన్నట్లు తెలిపారు. త్వరలో ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు పర్యటించి పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ముందుకు వస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాతిబుజ్జి, తహసీల్దారు అనిల్‌కుమార్, టూరింజం, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి పూజలు



కొమరాజులంకలో సూర్యభగవానుడికి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు వేంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి పూజలు శనివారం విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ధన్వంతరి స్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి సన్నిధిలోను, క్షణముక్తేశ్వరుని ఆలయంలోనూ రథసప్తమి వేడుకలు జరిపారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: రథసప్తమి సందర్భంగా మండలంలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబాజీపేట బస్టాండ్ వద్ద ఉన్న వాసవి మాత ఆలయంలో రథసప్తమి సందర్భంగా సూర్య భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

కొమరాజులంకలో..

రావులపాలెం: మండలంలో శనివారం రథసప్తమిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యంగా సూర్యమందిరం ఉన్న కొమరాజులంకలో భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప ప్రాంతాల్లో ఎక్కడా సూర్య భగవానికి దేవాలయం లేకపోవడంతో కొమరాజులంకలో ఉన్న సూర్య మందిరానికి సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. ఉదయానే సూర్యభగవానికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామికి కల్యాణం, శ్రీ చక్రస్థానం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈమని సీతారామమూర్తి కుమారులు సుబ్రహ్మణ్య భాస్కరశర్మ, సూర్యనారాయణమూర్తుల పర్యవేక్షణలో రథోత్సవం నిర్వహించారు.

ప్రభుత్వ పథకాల లక్ష్యాలను పూర్తి చేయాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అన్నారు. ఆలమూరు ఎంపీపీ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఉద్యోగులతో మండల అభివృద్ధి, పథకాల అమలుపై శనివారం సమీక్ష జరిగింది. ఈసందర్భంగా ప్రభుత్వ పథకాల అమలు– గ్రామ సచివాలయ ఉద్యోగుల పాత్రను వివరిస్తూ ఎంపీడీఓ జాన్‌లింకన్ ప్రసంగించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను గ్రామ వలంటీర్లతో అందించవలసిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని తెలిపారు. గ్రామాల్లో శాఖల వారీగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ నాణ్యమైన సేవలను అందించాలని, అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ధాన్యం లోడు లారీ బోల్తా

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిలోని చొప్పెల్ల వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధాన్యం లారీ బోల్తా పడింది. రాజమహేంద్రవరం వైపు నుంచి రావులపాలెం వస్తున్న లారీ స్థానిక ఇరిగేషన్ లాకుల వద్ద అదుపు తప్పి పంట కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ ఇద్దరూ చాకచక్యంగా వ్యవహరించి దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది. అంతలో లారీ యజమానులు వచ్చి క్రేన్ సాయంతో లారీని బయటకు తీశారు.

ప్రత్యేక కోర్సులకు ఎంపికైన విద్యార్థులు

ఆలమూరు: మండలంలోని చెముడులంకలోనున్న శ్రీఈశ్వర విద్యాలయ విద్యార్థులు ప్రత్యేక యూనివర్శిటీ కోర్సులకు ఎంపికయ్యారు. దేశంలో ప్రసిద్ధిగాంచిన అజీం ప్రేమ్‌జీ (బెంగళూరు), క్రియా (చెన్నై) యూనివర్శిటీలు ఉన్నత విద్యను అభ్యసించడానికి స్థానిక కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక ఇంటర్మీడియట్‌లో సివిల్, క్లాట్ ఒరియేంటేషన్ కోర్సులు చదువుతున్న టి.ప్రసన్న, ఎం.లక్ష్మీ వినీత, వి.మనీషా, ఎస్.శైలుశ్రీ క్రియా యూనివర్శిటీ కి ఎంపికయ్యారు. అలాగే అందులో ఇద్దరు విద్యార్థులు అజీం ప్రేమ్‌జీ యూనివర్శిటీకి ఎంపికైన వారిలో ఉన్నట్లు డైరెక్టర్ టి.ఉమారాణి పేర్కొన్నారు. తొలి బ్యాచ్‌లోనే ప్రతిష్టాత్మక యూనివర్శిటీకి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

కట్నం వేధింపులపై భర్తతో సహా ముగ్గురిపై కేసు

పి.గన్నవరం: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తతో సహా ముగ్గురిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఏఎస్సై ఇళ్ల ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. పోతవరం గణేష్‌నగర్‌కు చెందిన గుమ్మళ్ల స్వామికి బేబీరమణతో గతంలో వివాహం జరిగింది. ఈనేపథ్యంలో కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్త స్వామి, భార్యను వేధిస్తున్నాడని ఏఎస్సై వివరించారు. అతనికి సోదరుడు, సోదరుని భార్య సహకరిస్తున్నారని తెలిపారు. బేబీ రమణ ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై వివరించారు.

భర్తతో సహా ఏడుగురిపై కేసు

భార్యను అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్న భర్త, అత్తమామలతో సహా ఏడుగురిపై పి.గన్నవరం పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ బి.మురళీమోహన కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఊడిమూడి పెదపేటకు చెందిన నేలపూడి శత్రుఘ్నుడు కుమార్తె గంగాపార్వతికి అల్లవరం మండలం ఎంట్రుకోన గ్రామానికి చెందిన ఉల్లింగి నారాయణరావుతో 2011లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావాలని భర్త భార్యను వేధిస్తున్నాడు. పెద్దల్లో చర్చలు జరిపినా ఫలితం లేదు. అదనపు కట్నం కోసం భర్తతో పాటు, అత్త మామలు, ఆడపడుచులు వేధిస్తున్నారని గంగాపార్వతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుతో భర్తతో పాటు మొత్తం ఏడుగురిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ వివరించారు.

మామను గాయపరచిన అల్లుడిపై కేసు

పి.గన్నవరం: భార్యను ఎందుకు వేధిస్తున్నావని ప్రశ్నించిన మామపై అల్లుడు దాడి చేసిన ఘటనపై పి.గన్నవరం పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ ఎ.నాగశంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కె.ముంజవరానికి చెందిన లూటుకుర్తి నాగేశ్వరరావు కుమార్తె ఉందుర్తి సుధ, భర్త నర్సింహమూర్తి, ఇద్దరు పిల్లలతో సహా తండ్రి వద్దే ఉంటోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి భర్త నర్సింహమూర్తి మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యను వేధిస్తున్నాడు. దీంతో మామ నాగేశ్వరరావు అల్లుడిని ఇదేమని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన అల్లుడు ఇటుకతో మామపై దాడి చేశాడు. గాయాల పాలైన నాగేశ్వరరావును పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ వివరించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో శనివారం నిత్యాన్నదానానికి వేర్వేరు ప్రాంతాలకు పలువురు భక్తులు కలిపి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు పై మొత్తాన్ని ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అందజేశారు. ఆయన నుంచి స్వామి చిత్రపటం, ప్రసాదాలను వారు అందుకున్నారు. విరాళాలు ఇచ్చిన దాతల్లో దండు శ్రీరామచంద్ర బంగారాజు, అప్పన సుబ్రహ్మణ్యం , ఆదిమూలం పుల్లయ్యనాయుడు, యేపుగంటి రాంబాబు, ఆకన బాబ్జీ నాయుడు, మేడిచర్ల వెంకటేశ్వరరావు ఉన్నారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కలిదిండి బహదూర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టారంటూ నిరసన

కొత్తపేట: మండలంలోని పలివెలలో అక్రమ మట్టి తవ్వకాలు జరిపారంటూ టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టారని మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. పలివెల పంచాయతీ ద్వారా రోడ్డు నిర్మాణం చేపట్టి, ప్రత్యామ్నాయ మార్గంగా కాలనీలో మట్టిని చదును చేస్తుంటే కేసులు పెట్టారని, దానిపై నిరసిస్తే మళ్లీ మరికొంత మందిపై అక్రమ కేసు పెట్టారంటూ మండల టీడీపీ నాయకులు పలివెల నుంచి ప్రదర్శనగా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని నినాదాలు చేశారు.

వెంకన్న సన్నిధిలో జెడ్పీ సీఈవో

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో జెడ్పీ సీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణ శనివారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వార్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దీక్ష విరమణ

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో వేంచేసిన ఉమా సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారి పేరు పార్వతిగా పేరు మార్పుపై గత రెండు రోజుల నుంచి చేస్తున్న ఆమరణ దీక్షను శనివారం విశ్రాంత ఉపాధ్యాయుడు ద్విభాష్యం శ్రీనివాసు విరమించారు. పంచాయతీ పాలకవర్గానికి, దీక్ష చేసిన శ్రీనివాసుకు మధ్య చర్చలు సఫలీకృతం కావడంతో ఆ మేరకు దీక్షను విరమించినట్లు శ్రీనివాసు ప్రకటించారు. సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని గ్రామస్తులు పేరు మార్పును అంగీకరిస్తూ గ్రామ సభ తీర్మానం చేసేందుకు అంగీకరించారు. ఇక నుంచి పూర్వం నుంచి వస్తున్న ఆచార వ్యవహారాల మాదిరిగానే ఇక నుంచి తప్పనిసరిగా ఆలయంలో ఉమా సమేత మల్లేశ్వరస్వామి ఉచ్చారణతో పూజలు నిర్వహించనున్నారు.

ఆర్థిక సాయం పంపిణీ

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక శివారు సుంకరేవులో బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్న వాసూకురి దుర్గారావుకు సఖినేటిపల్లికి చెందిన దాత గొల్లమందల బాలరత్నం రూ.10 వేల ఆర్థిక సాయం శనివారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ రుద్రరాజు వెంకట్రాజు, యల్లమెల్లి కిషోర్, చల్లా నాగరాజు, నడింపల్లి వెంకట సుబ్బరాజు, ముత్యాల నాని, రేపూరి ఏసు రాజా, తాడి సహదేవ్, కె.దొరబాబు పాల్గొన్నారు.

కొబ్బరి ఉప ఉత్పత్తులపై దృష్టి సారించాలి

అంబాజీపేట: కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీపై రైతులు దృష్టి సారించడం వల్ల ఆర్థిక పురోభివృద్ధి సాధించవచ్చని ఏపీ స్టేట్ అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి నేతల మల్లికార్జునరావు అన్నారు. గోదావరి ఇంటిగ్రేటెడ్ ఫార్మర్స్ ట్రేడింగ్ అండ్ ప్రొడ్యూసర్ కంపెనీ (గిఫ్ట్) ఆధ్వర్యంలో మాచవరం పరిధిలోని పోతాయిలంక ఆర్బీకే వద్ద కొబ్బరిలో వచ్చే తెగుళ్ల, తెల్లదోమ నివారణ, అధిక దిగుబడులపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం బోర్డు సభ్యులు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, వైస్ ఎంపీపీ సుదాబత్తుల లక్ష్మీభార్గవి, ఏఎంసీ వైస్‌చైర్మన్ నాగవరపు నాగరాజు, హెచ్‌వో ఎం.దిలీప్‌కుమార్, బీకేఎస్ నాయకులు ముత్యాల జమీలు, నాయకులు సుదాబత్తుల రాము, నాగాబత్తుల సుబ్బారావు, పీడబ్ల్యూసీ జిల్లా కోఆర్డినేటర్ ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రథమ వార్షికోత్సవం

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామంలో కొలువు దీరిన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి, రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వార్ల ఆలయ పునః ప్రతిష్ఠా ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో పీవీఎస్ఎస్ కామేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు భక్తులు కర్తలుగా పాల్గొని పూజలు నిర్వహించారు.

రావులమ్మ పానకం వార్షికోత్సవం

అంబాజీపేట: గంగలకుర్రు రావులమ్మ పానకం ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని అరిగెల రాంబాబు ధన సాయంతో పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయం వద్ద జయంతి భాస్కర సుబ్రహ్మణ్యం ఆధ్వర్యాన భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు గ్రామంలో కొలువైన వేంకటేశ్వరుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

స్వామికి రూ.2.30 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. రథసప్తమి కావడంతో స్వామి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. ఉభయ దేవేరులతో కొలువుదీరిన స్వామి వారిని దర్శించుకున్నారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,67,229 ఆదాయం వచ్చింది. నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.63,079 విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా స్వామికి రూ.2.30 లక్షల ఆదాయం వచ్చింది. 2,975 మంది స్వామిని దర్శించుకున్నారు. ఈవో ఎంకేటీ నాగవరప్రసాద్, చైర్మన్ చిట్టూరి రామకృష్ణ భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.